

# భవానీద్వీపం

- వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 49 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

నిశ్చేష్టులై చూస్తున్నారు పాతకమూరు సోదరులు. కృష్ణమాచార్యులు బిగ్గరగా రోదిస్తున్నాడు, ఆప్తులెవరో హఠాత్తుగా కాలంచేస్తే రోదించినట్లు. నీటిబుగ్గల్లోంచి ఉబికి ఉబికి వస్తున్న ఊట నీటిలా తెరలు తెరలుగా కన్నీరు చెంపలమీదుగా ఛాతీ మీదకు ధారలుగా కారిపోతున్నది. అసలే ఎఱ్ఱని ముద్దుముఖం, బచ్చలి పండులాగా యింకా ఎఱ్రగా అయ్యింది ఆ రోదనకు.

అన్నదమ్ములెవరూ ఏమీ మాట్లాడలేదు కొంతసేపు. తర్వాత అందరిలోకీ చిన్నవాడు జ్వాలా నరసింహుడు ఏదో అనబోయాడు. యోగానందుడు చేతి సైగతో వారించాడు. వర్షంతో ఋతువు మారి, ఉద్ధృతం ఐనట్లు మనిషి పశ్చాత్తాపంతో కన్నీటివర్షంతో మారుతాడు. నీరంతా వర్షించిన తర్వాత మేఘాలు కనిపించకుండా పోయి, ఆకాశం తేటపడినట్టు కన్నీరంతా కారిపోతే దుఃఖంనుంచి మనిషి తేటపడుతాడు.

ఎదుట ఎవరో అపరిచితులు ఉన్నారన్న ఆలోచన కూడా లేకుండా పసిపిల్లాడిలా ఏడ్చి ఏడ్చి నిస్త్రాణగా ఉండిపోయాడు కృష్ణమాచార్యులు. " తమరు కారణ జన్ములు. ఇంతగా ధైర్యం చెడకూడదు. పరమేశ్వరుడి పరీక్షలకు అవతార పురుషులూ లోను కాలేదూ? మీరూ అంతే! తొండరడిప్పొడి ఆళ్వారుల కథ తమకు తెలియనిది కాదుకదా" అన్నాడు యోగానందుడు అనునయంగా! ఆ మాటలకు మరొక్కసారి కుదుపుకు లోనైనట్టు విలపించాడు కృష్ణమాచార్యులు. దాంతో యే మూలో కాస్తో కూస్తో మిగిలిన శోకం కన్నీరుగా కరిగిపోయింది. ప్రశాంతంగా వుండిపోయాడు కొంతసేపు.

చెరువు మీదినుండి వస్తున్న చల్లగాలికి సేదదీరుతున్నట్లుగా కూర్చుండిపోయారు అందరూ. కుటీరం పైకప్పు మీద చేరిన పక్షుల కిలకిలలు వినిపిస్తున్నాయి. చెరువుమీదినుండి నీటిపక్షుల ధ్వనులను గాలులు మోసుకొస్తున్నాయి. 'పక్షిరాజ తురగుడా పరాకు సేయకూ..' అని బ్రతిమాలుతున్నట్లుగా నెమ్మదిగా మంద్రంగా మొదలైంది కృష్ణమాచార్యుల కంఠం నుండి ఒక తేనెసోన!

తేలిక పదాలు. పాండితీ ప్రకర్షా లేదు, ప్రదర్శనాలేదు. చెలమలోనుండి ఊరుతున్నతీయని జలంలా గుండె లోతులలోనుండి ఉబుకుతున్న విన్నపం. 'పసిబాలుని వలెనూ పలికెద నన్ననూ ప్రహ్లాదుడు మీ చెంతనే వున్నాడే' అని నృసింహ స్తుతిగా పదం ప్రవహించడం మొదలైంది. 'బాలకులనూ భళిగా లాలించుటకూ జ్వాలా నరసింహూడా నీలా ఎవరున్నారూ' అని కొనసాగుతున్నది.

మేఘ గంభీర స్వరం కృష్ణమాచార్యులది. ఉదయపు ప్రశాంత సమయంలో గాలులకు ఆ స్వరం చుట్టుప్రక్కలకు శంఖనాదంలా వినిపించడం మొదలైంది. ఒకరు, యిద్దరు, ముగ్గురుగా మొదలై, గుంపుగా శ్రోతలు పర్ణశాలలో చేరారు. ఎంతకాలానికో వసంతమొచ్చింది అని సంతోషంగా కోకిల మైమరచి పాడుతున్నట్టు ప్రపంచ స్పృహ లేకుండా పాడుతున్నాడు కృష్ణమాచార్యులు. ఎంతకాలానికో ఆ గళం అలా ఆ కుటీరంలో ధ్వనించడం మొదలుబెట్టింది అని ఆబగా పోగై వింటున్నారు శ్రోతలు.

గానం ప్రారంభం ఐన వెంటనే తమ మూటలు విప్పారు అన్నదమ్ములు. పల్లవి పూర్తి కాకముందే గజ్జెలు కట్టుకోవడం, నడుముకు కటిబంధం చుట్టుకోవడం, కనులకు కాటుక, నుదుట బొట్టూ దిద్దడం ఐపోయింది. ఇక అద్భుతమైన నాట్యం మొదలైంది. కూడబలుక్కుని తోడుగా ప్రదర్శన చేస్తున్నట్టు ఆ గానానికి అనుగుణంగా నృత్యం సాగుతున్నది. చెవులను పాత్రలుగా చేసుకుని ఆ గానపానం చేస్తున్నారు శ్రోతలు. కన్నులు పాత్రలుగా చేసుకుని ఆ దివ్య నర్తనం ఆస్వాదిస్తున్నారు.

ప్రహ్లాదుడి ప్రస్తావన వస్తుండగానే గునగునా లోపలినుండి ముద్దుగా బొద్దుగా వున్న పిల్లాడు తలవరకూ బయటపెట్టి తొంగి చూసి మురిపెంగా చిరునవ్వులు చిందించాడు. వాడిని చూసి పరవశించి పోయారు అన్నదమ్ములు. బంతులలాంటి బుగ్గలు, నల్లటి గండుతుమ్మెదలలాంటి పెద్ద పెద్ద కనులు. కుటీరం పైకప్పుకు అల్లుకుపోయిన తీగకున్న పూలలాంటి ఎర్రటి పల్చని పెదాలు. అప్పుడే స్నానం చేయించి, యింకా జుట్టు దువ్వలేదేమో వాళ్ళమ్మ, నొక్కుల నొక్కుల నల్లని జుట్టు చెంపలమీదుగా ఎగురుతున్నది వాడు తల తిప్పి అటూ యిటూ చూస్తుంటే.

'రారా రాజీవా నయనా, రాజూగా దాసూద నన్నేలూకోరా నరసింహూడా' అని అందుకున్నప్పుడు భావానికి అనుగుణంగా నర్తిస్తూ వెళ్ళి, వాడిని పిలుస్తూ చేతులు సాచాడు యోగానందుడు లయబద్ధంగా అడుగులు వేస్తూ. ఏ మాత్రమూ సంకోచించకుండా ఆ చేతులు పట్టుకుని చిందులు తొక్కుతూ బయటకు వచ్చాడు బాలుడు. తనూ కేరింతలు కొడుతూ చిందులు తొక్కడం మొదలుబెట్టాడు, సోదరులతో కలిసి. ఆ దివ్య సంకీర్తనం, ఆనంద నర్తనం ఎంతసేపు అలా కొనసాగాయో గాయకుడికీ, నర్తకులకూ, శ్రోతలకూ ఎవరికీ పట్టలేదు. అదొక అనుభవం. అదొక పారలౌకికమైన అనుభూతి, బహుశా దానినే బ్రహ్మానందం అంటారేమో!

ఆ పసివాడికి కూడా ఆనందమే తప్ప అలసట లేనట్టుంది. వాడూ తీసిపోకుండా కదం తొక్కాడు. పదులసంఖ్యలో గుమికూడిన శ్రోతలలోనుండి కొంతసేపటికి ఒకవ్యక్తి లేచాడు. సందు చేసుకుంటూ ముందుకు వచ్చి, అరుగుమీద పందిరి గుంజకు ఆనుకుని కూర్చున్నాడు. నోరు తెరుచుకుని ఆ నృత్యాన్ని చూస్తూ, గానాన్ని వింటూ కృష్ణమాచార్యులను చూపులతో శోధిస్తూ కూర్చున్నాడు. అతడి ముఖంలో పట్టరాని ఆనందం. అక్కడున్న శ్రోతలందరి అనుభూతికీ భిన్నమైన అనుభూతి అతడిది. విభిన్నమైన ఆనందం అతడిది. ఏదో సాధించిన సంతృప్తి అతడి ముఖంలో కనిపిస్తున్నది. ఆ గానానికో, గానంతో మమేకమై కన్నులపండుగగా సాగుతున్న నృత్యానికోగానీ అతడి కనులచెమ్మ చెంపలను తడుపుతూ తళతళ మెరిసిపోతున్నది. అతడు అంతకుముందు రావిచెట్టుకింద సోదరులతో మాట కలిపిన వ్యక్తి. అలంపురం నుండి సింహాచలేశుడి దర్శనం కోసం వచ్చిన వ్యక్తి జయజయ ధ్వానాలతో, మంగళంతో సంకీర్తన ముగించాడు కృష్ణమాచార్యులు. తోడుగా తామూ జేకొట్టారు మూగిన శ్రోతలు, నర్తకులు. మౌనంగా ఒక్కసారి అందరినీ కలయ జూసి కనులు మూసుకుని గోడకు ఆనుకుని కూర్చుండిపోయాడు కృష్ణమాచార్యులు. అది అలసట కాదు. ప్రశాంతత. అది హాయి! తప్పిపోయిన పిల్లాడు మళ్ళీ అమ్మ ఒడిని చేరుకొని, ఆ స్పర్శను నిలువెల్లా అనుభవిస్తూ హాయిగా కనులు మూసుకున్నట్టు ఉండిపోవడం!

గానం పూర్తి కాగానే దూరంనుండే నేలకు చేతులు ఆనించి కృష్ణమాచార్యులకు దండాలు పెట్టి వెళ్ళారు కొందరు. వినయంగా వచ్చి, అరుగుకు చేతులు ఆనించి దండాలు పెట్టి వెళ్ళిపోయారు కొందరు. అందరూ వెళ్ళిపోయారు. అన్నదమ్ములు, ఆలంపూరు వాస్తవ్యుడు, కృష్ణమాచార్యులు మిగిలిపోయారు. గానం పూర్తి అయ్యి, నర్తనం ఆగిపోయి, బిగ్గరగా జయజయ ధ్వానాలు మొదలు కాగానే గునగునా లోపలికి పరిగెత్తుతున్న పిల్లవాడిని పట్టుకోబోయాడు జ్వాలనందుడు. వాడు చిక్కకుండా తుర్రున మాయమైనాడు.

'ఇక ఆగదు స్వామీ! ఈ ప్రవాహం కొనసాగుతుంది. కొనసాగించండి! తమరు నాలుగు లక్షల పదాలు స్వామికి సమర్పిస్తానని వాగ్దానం చేశారట' అరుగుమీద చేరగిలబడుతూ అన్నాడు యోగానందుడు. ఆశ్చర్యము, ఆనందము కలగలిసిన చూపులతో నిలువెల్లా అతడిని అభిషేకించాడు కృష్ణమాచార్యులు. 'తమరికెలా తెలుసు?' అన్నాడు కలలో మాట్లాడుతున్నట్లు. 'అహోబిలేశుడు కలలో కనిపించి, ఆనతిస్తేనే తమరి దర్శనం కోసం వచ్చామని విన్నవించాను కదా స్వామీ' అన్నాడు యోగానందుడు. 'ఎంత భాగ్యవంతులు మీరు! స్వామిని చూసిన కన్నులతో ఈ భ్రష్టుడిని చూడడం వీడి అదృష్టం అనుకోవడమే. వీడికి స్వామి దర్శన భాగ్యం లేదు' అన్నాడు ఆర్తితో కృష్ణమాచార్యులు.

జ్వాలానందుడి మనసంతా లోపలికి, అమ్మదగ్గరికి పరుగెత్తిన పిల్లాడిమీదే వున్నది యిందాకటినుండీ. ఒక్కసారి వాడిని దగ్గరకు తీసుకుని, బుగ్గలు పిండి, వొళ్ళో కూర్చోబెట్టుకుని, ముద్దు చెయ్యాలని తహతహగా వున్నది. మామూలు అందమా వాడిది! ఇక ఆగలేకపోయాడు. 'స్వామీ! ఏమనుకోకుంటే ఒక్కసారి పిల్లవాడిని బయటకు పిలవరూ! అలాగే అమ్మగారినీ పిలిపిస్తే తమ దంపతులకు దక్షిణ యిచ్చుకుని, యిక మేము బయలుదేరుతాము' అన్నాడు సాభిప్రాయంగా తన అన్నలందరినీ కలయ చూస్తూ.

'పిల్లవాడెవరు' అని అడిగాడు కృష్ణమాచార్యులు కొద్దిగా అయోమయంగా. 'తమరి కుమారుడు కాదూ! యిప్పటిదాకా తనూ మాతో చిందులు తొక్కాడు తమరు పాడుతుంటే. తమరు కళ్ళు మూసుకుని..' అంటుండగా ఒక్క వుదుటున 'నరసింహా! నరసింహా!'అని ఆక్రోశిస్తూ సుడిగాలిలా లోపలకు పరుగుపెట్టాడు కృష్ణమాచార్యులు. ఆపకుండా పిలుస్తూ పెరటిలోకి వెళ్ళాడు. మరలా కుటీరం లోపలికి వచ్చాడు. కూకటి వేళ్ళతో కూలిపోయిన వటవృక్షంలా తన పూజామందిరం ముందు కూలిపోయాడు. 'నరసింహా! నరసింహా!' అని పెద్దగా ఆక్రోశిస్తూ విలపించాడు.

కొన్ని క్షణాలు ఏం జరిగిందో అర్థం కాక ముఖాలు చూసుకుంటూ నిలబడిపోయారు అన్నదమ్ములు. ఒకరొకరుగా నెమ్మదిగా లోపలకు వెళ్ళారు. వారిని చూడడంతోటే మోకాళ్ళమీదే పరుగునా వచ్చి ఒక్కొక్కళ్ళ పాదాలమీద పడిపోయాడు కృష్ణమాచార్యులు. వారు విడిపించుకోడానికి ప్రయత్నం చేసినకొద్దీ పాదాలకు చుట్టుకుపోయాడు 'నరసింహా! నరసింహా! అని విలపిస్తూ.

'నరసింహుడే కనిపించాడు మీకు! నాకూ పిల్లవాడు ఎవరూ కనిపించలేదు. మొదలయిన దగ్గరనుండీ నేను యిక్కడే వున్నాను అన్నాడు' ఆలంపురం వ్యక్తి. అతడూ కుటీరం లోపలకు వచ్చి, ద్వారంలో నిలబడ్డాడు జరుగుతున్నదంతా సంభ్రమంగా చూస్తూ. మరలా భోరున శోకించాడు కృష్ణమాచార్యులు. ఒక్క నిముషం మౌనంగా వుండి 'కృష్ణమాచార్యులకు వివాహం జరగలేదు. అందుకోసమే నేను వచ్చాను' అన్నాడు ఆలంపురం వ్యక్తి. సొమ్మసిల్లి పడిపోయిన కృష్ణమాచార్యుల ముఖం తడి వస్త్రంతో తుడిచారు. అతడు తెప్పరిల్లిన తరువాత నెమ్మదిగా అరుగులమీద చల్లగాలికి కూర్చోబెట్టి కొండమీద యిచ్చిన స్వామివారి ప్రసాదం నెమ్మదిగా తినిపించారు. తమ సొరకాయ బుర్రల్లో చల్లటి నీటిని తాగించారు. అలంపురం వ్యక్తి వారికి సహాయం చేశాడు కృష్ణమాచార్యులకు సపర్యలు చేయడంలో.

అంతా సర్దుకున్న తరువాత 'తమరికీ ఈ స్వామికీ ఏమిటి సంబంధం' అని ఆలంపూరు మహాశయుడిని వింతగా అడిగాడు యోగానందుడు. ఎలా చెప్పాలో అర్థం కానట్టు చూశాడు అతడు. 'నేను అతగాడి మేనమామను!' అన్నాడు. అతడి గొంతు అతడికే కీచుగా, విచిత్రంగా ధ్వనించింది. వులికిపడి 'నాకా? మేనమామలా?' అని అడిగాడు కృష్ణమాచార్యులు. అతడి గొంతులో కొద్దిగా నీరసం, చిరాకు వినిపించాయి.

'అవునయ్యా! పోయినేడు మొదటిసారి సింహాచలం వచ్చినప్పుడు మంటపంలో గానం చేస్తున్న నిన్ను చూశాను. ముమ్మూర్తులా నీ పితామహుడు శఠగోపాచార్యులవారి పోలికలు కనిపించాయి. అదే రూపం, అదే అవయవ సౌష్టవం, అదే నవ్వు, అదే గొంతు! విచిత్రమైన ఆ పచ్చబొట్టు, వయసు ఈ రెండే తేడా. యింటికి వెళ్ళినతరువాత నీ గురించి చెప్పి, ఆ పచ్చబొట్టు గురించి చెప్పినప్పుడు ఒక్కసారే పెద్దపెట్టున శోకాలు పెట్టింది మా అమ్మగారు, నీ మాతామహురాలు. పురుడుపోసిన మంత్రసానిని వున్నపళంగా పిలిపించింది' అంటూ వున్నట్టుండి ఆగిపోయాడు ఆలంపూరు మహాశయుడు. అందరూ విచిత్రంగా చూస్తున్నవైపు చూశాడు అప్రయత్నంగా.

వెదురు తడికను పక్కకు జరుపుతూ లోపలకు వస్తున్నాడు ఒక వృద్ధుడు. కనులు తప్ప ముఖంలో ఏమీ కనబడకుండా గుబురుగా తెల్లబడ్డ కనుబొమలు, గడ్డంతో, వంగిపోయిన తాడిచెట్టులా అంతెత్తు వున్నాడు. ఒక చేతిలో తంబుర వున్నది. మరొక చేతిలో చిడతలు వున్నాయి. వందల ఏళ్ళ వటవృక్షంలా వృద్ధుడిలావున్నాడు, దృఢముగా వున్నాడు. చూడగానే ఎందుకో తెలియదు, వృద్ధ సింహాన్ని చూసిన జంకు, గగురుపాటు కలిగేట్టు వున్నాడు.

గుర్తు వచ్చిందా? పాఠకుడా! కొన్నేళ్ళ క్రితం మనిషికి మనిషి కనిపించని కుంభవృష్టిలో ఒక పాడుబడ్డ బావిలోనుండి పసిమొగ్గలాంటి శిశువును చేదుకున్నాడు ఒక విచిత్ర వ్యక్తి! అతడే యితడు!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS